సాక్షి ఖమ్మం

శుక్రవారం । 21 । మార్చి । 2025



.. ఎమర్జెన్సీ బృందాలు

విద్యుత్ సంబంధిత సమస్యలను సత్వరమే పరిష్కరించేలా ఖమ్మం సర్కిల్‌లో ఎమర్జెన్సీ బృందాలను ఏర్పాటుచేశారు. IIలో





వాతావరణం

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులు వీచే అవకాశముంది.

న్యూస్‌రీల్

మున్సిపల్ సేవలను వినియోగించుకోవాలి



చలివేంద్రాన్ని ప్రారంభించిన అదనపు కలెక్టర్ శ్రీజ

వైరా: వేసవి కాలంలో ప్రజల సౌకర్యార్థం మున్సిపాలిటీ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన చలివేంద్రాలను వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. వైరాలోని ఐదు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను గురువారం ఆమె ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ ఉద్యోగులతో సమావేశమైన అదనపు కలెక్టర్ ఈనెలాఖరు నాటికి వంద శాతం పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చింతా వేణుతో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

జమలాపురం ఆలయ హుండీ ఆదాయం రూ.32.86లక్షలు



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది, అర్చకులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. ఖమ్మం కమాన్‌బజార్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం , జమలాపురం ఆలయ ఈఓలు కె.వేణుగోపాలచార్యులు, కె.జగన్మోహన్‌రావు ఆధ్వర్యాన చేపట్టిన లెక్కింపులో 91 రోజులకు గాను రూ.32,86315 ఆదాయం నమోదైంది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామ చంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి, సిబ్బందితో పాటు శ్రీసత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

'విద్యానిధి'కి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించే వారికి ఆర్థిక సాయం అందించేలా అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి ద్వారా అర్హులైన ఎస్సీ విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. యూఎస్‌ఏ, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్, యూకే, సింగపూర్, జపాన్, సౌత్ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో పీజీ కోర్సులు చేసే వారికి ఈ పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. కుటుంబంలో ఒకరికే వర్తించే ఈ పథకం కోసం 35ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారు వచ్చేనెల 19లోగా తెలంగాణ ఈపాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కుటుంబ వార్షికాదాయం రూ.5 లక్షలకు మించొద్దని, టోఫెల్, ఐఈఎల్‌టీఎస్, జీఆర్‌ఈ, జీమ్యాట్, పీటీఈలో అర్హత సాధించి.. విదేశాల్లో గుర్తింపు పొందిన యూనివర్సిటీలో ప్రవేశం పొందిన వారు అర్హులని వెల్లడించారు. పూర్తి సమాచారం కోసం కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో సంప్రదించాలని డీడీ సూచించారు.

ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ పేరిట వసూళ్లు

- రూ.50వేల మేర జమ చేయించుకున్న గుర్తుతెలియని వ్యక్తి

సత్తుపల్లి: షాపు ట్రేడ్ లైసెన్స్ గడువు తీరినందున రెన్యూవల్ చేసుకోకపోతే జరిమానా పడుతుందని దబాయిస్తూ ఓ వ్యక్తి చేసిన ఫోన్‌లో సత్తుపల్లిలోని పలువురు వ్యాపారులు హడలిపోయారు. ఈమేరకు కొందరు వ్యాపారులు లైసెన్స్ రెన్యూవల్ చేయాలని ఫోన్ చేసిన వ్యక్తిని కోరగా.. ఆయన ఓ ఫోన్ నంబర్ ఇచ్చి 'నీరజ్‌గుప్తా' పేరు వస్తుందని అని చెబుతూ రూ.2వేలు ఫోన్‌పే చేయాలని సూచించాడు. అలా చేశాక సమయం దాటినందున రూ.570 జరిమానా చెల్లించాలని, ఆపై రూ.500 తిరిగి వస్తాయంటూ నమ్మబలికినట్లు తెలిసింది. దీంతో సత్తుపల్లికి చెందిన పలువురు రూ.50వేల మేర చెల్లించినట్లు తెలిసింది. ఈ విషయం విస్తృతంగా ప్రచారం కావడంతో మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహ స్పందించారు. ట్రేడ్‌లైసెన్స్ లైసెన్స్ కోసం ఎవరూ ఫోన్ చేయరని స్పష్టం చేశారు. ఎలాంటి లావాదేవీలైన వార్డు ఆఫీసర్ స్వయంగా వస్తారని, లేదంటే వ్యాపారులే కార్యాలయానికి రావాలని సూచించారు. కాగా, అపరిచిత వ్యక్తి చేసిన ఫోన్ కాల్‌తో తాము రూ.2,570 చెల్లించానని వ్యాపారి రాయల నరేంద్రకుమార్, తదితరులు తెలిపారు. ఆతర్వాత మోసపోయినట్లు తెలిసిందని వాపోయారు.

14 మన స్థానమిది...



తలసరి ఆదాయంలో జిల్లా రాష్ట్రంలో 14వ స్థానంలో నిలవగా... స్థూల జిల్లా దేశీయోత్పత్తి(జీడీడీపీ)లో 8వ స్థానం దక్కించుకుంది. ఇలా పలు రంగాల్లో జిల్లా మెరుగైన స్థానంలోనే నిలిచినా గతంలో దట్టమైన అడవులు కలిగి ఉన్నప్పటికీ ప్రస్తుతం 13.91 శాతం అటవీ ప్రాంతంతో రాష్ట్రంలో 17వ స్థానానికి పరిమితం కావడం గమనార్హం. తాజాగా అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సామాజిక, ఆర్థిక సర్వే(సోషియో ఎకనామిక్) ఔట్ లుక్ ద్వారా ఈ వివరాలు వెల్లడయ్యాయి.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

జిల్లా తలసరి ఆదాయం రూ.2,49,517

- యూనిట్ల స్థాపన, పెట్టుబడి, ఉపాధిలో మెరుగైన స్థితి
- పట్టణ ప్రాంతంలో జనాభా 3.1 లక్షలు
- సోషియో ఎకనామిక్ ఔట్‌లుక్ – 2025లో వెల్లడి

తలసరి.. పర్వాలేదు

జిల్లా తలసరి ఆదాయం రూ.2,49,517గా నమోదైంది. దీంతో రాష్ట్రంలో జిల్లాకు 14వ స్థానం దక్కింది. జిల్లాలో వ్యక్తుల సగటు ఆదాయాన్ని తలసరి ఆదాయంగా నిర్ణయిస్తుండగా.. ఇది జిల్లా ఆర్థిక శ్రేయస్సును ప్రతిబింబిస్తుంది. అలాగే, స్థూల జిల్లా దేశీయ ఉత్పత్తి(జీడీడీపీ) ప్రస్తుత ధరల వద్ద 2023–24 ఏడాదికి రూ. 41,576 కోట్లుగా ఉంది. దీంతో జిల్లా రాష్ట్రంలో ఎనిమిదో స్థానం దక్కించుకుంది. ఏడాది కాలంలో జిల్లాలో ఉత్పత్తి అయిన వస్తువులు, సేవల మార్కెట్‌ను జీడీడీపీగా పిలుస్తారు. ఇందులో రంగారెడ్డి జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది.

జిల్లాలో 38 యూనిట్లు

2024–25 ఏడాదికి సంబంధించి జిల్లాలో ఫిబ్రవరి 28వ తేదీ వరకు టీజీ–ఐపాస్ ద్వారా సాంకేతిక తయారీ రంగానికి సంబంధించి 38యూనిట్లు ఆమోదించారు. ఇందులో భాగంగా రూ.51.59 కోట్ల పెట్టుబడులు రాగా.. 298మందికి ఉపాధి లభించింది. ఈ రంగంలో జిల్లా 13వ స్థానానికి పరిమితమైంది. మొత్తం మీద జిల్లాలో 856 యూనిట్లకు రూ.890 కోట్ల పెట్టుబడులు రావడంతో 8,628 మందికి ఉపాధి లభించింది. జిల్లా విభిన్న పంటలకు నెలవు కావడంతో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. ఈ రంగంలో రాష్ట్రంలోని మేడ్చల్–మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాలు మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి.

ఒక్కొక్కరికి రెండెకరాలకు పైగా..

జిల్లాలో సగటు భూమి నిర్వహణ రెండెకరాలకు పైగా ఉందని ఈ నివేదికలో పేర్కొన్నారు. వరి, మిర్చి, మొక్కజొన్న, పత్తితో పాటు అన్ని రకాల ఉద్యాన వన పంటలు జిల్లాలో సాగవుతున్నాయి. విభిన్న పంటలే కాక వానాకాలం, యాసంగి రెండు సీజన్లలో పంటల సాగుతో రాష్ట్రంలోనే జిల్లా రైతాంగం ప్రత్యేకంగా నిలుస్తోంది. నాగార్జునసాగర్ ఆయకట్టు ఉండడానికి తోడు చెరువులు, కుంటల కింద ఆయా పంటలు సాగవుతున్నాయి. 2021–22 ఏడాది 11వ వ్యవసాయ జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 3,25,775 మంది 2,97,520.17 హెక్టార్ల భూమిలో పంటలు సాగుచేస్తున్నారు.

ఖనిజాల ఆదాయం రూ.80.17 కోట్లు

జిల్లాలో ఖనిజ వనరులు పుష్కలంగా ఉన్నాయి. దీంతో 2024–25 ఏడాదికి సంబంధించి 2024 డిసెంబర్ వరకు ఖనిజ వనరుల ద్వారా రూ.80,17,65,000 ఆదాయం సమకూరాలి. ప్రధానంగా గ్రానైట్ క్వారీలు, ఫ్యాక్టరీల నుంచే ఈ ఆదాయం లభిస్తుంది. ఇందులో ఇప్పటి వరకు రూ.68,36,76,000 వసూలయ్యాయి. తద్వారా రాష్ట్రంలో జిల్లా 14వ స్థానంలో నిలిచింది.

ఇంకొన్ని...

- 100 చదరపు కి.మీ.కు జిల్లాలో రోడ్డు సాంద్రత 118.8 కి.మీ.గా ఉంది. ఒక నిర్దిష్ట ప్రాంతంలో రోడ్డు పొడవు, ఆ ప్రాంతం విస్తీర్ణంతో భాగించినప్పుడు వచ్చే నిష్పత్తిని సాంద్రతగా పరిగణిస్తారు.
- 'అనీమియా ముక్త్ భారత్'లో ఖమ్మం 80.3శాతంగా ఉంది. దీంతో రక్తహీనతను తగ్గించడంలో మంచి పనితీరు కనబర్చినట్లు తేలింది. ఐరన్, ఫోలిక్ యాసిడ్ యాత్రల పంపిణీతో రక్తహీనత తగ్గించేందుకు దోహదపడింది.
- 2024–25 ఆర్థిక సంవత్సరం జనవరి 24వరకు ఉన్న లెక్కల ప్రకారం.. ఉపాధి హామీ పథకం ద్వారా 62.2లక్షల పనిదినాలు కల్పించాలనేది లక్ష్యం. ఇందులో 54.6 లక్షల పనిదినాలు కల్పించడంతో 87.9శాతంగా లక్ష్యసాధన నమోదైంది.
- జిల్లాలో 3.1 లక్షల మంది పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. ఈ విభాగం ర్యాకింగ్‌లో రాష్ట్రంలో జిల్లాకు మూడో స్థానం దక్కడం విశేషం. హైదరాబాద్, వరంగల్ రెండు, మూడు స్థానాల్లో ఉండగా.. నిజామాబాద్, ఖమ్మం ఉమ్మడిగా మూడో స్థానాన్ని పంచుకున్నాయి.

రెండు కళ్లలా అభివృద్ధి, సంక్షేమం

- ఉగాది నుంచి రేషన్‌షాపుల్లో సన్నబియ్యం
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి పొంగులేటి, పక్కన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఐడీసీ చైర్మన్ విజయ్‌బాబు తదితరులు

పెనుబల్లి/కల్లూరు రూరల్: ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు పథకాలు అమలుచేస్తూనే అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. పెనుబల్లి మండలం రామచంద్రాపురంలో గురువారం ఆయన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పాటు ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు రూ.87 లక్షలతో చేపట్టే సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో శంకుస్థాపన చేశారు. అలాగే, కల్లూరు మండలం ఎర్రబోయినపల్లిలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, పెద్దకోరుకొండిలో ఎస్సీ కమ్యూనిటీహాల్, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన అప్పులను తీరుస్తూనే అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో నిర్వర్తిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఉద్యోగాల భర్తీ, రైతుల రుణమాఫీ, రైతుభరోసా, మహిళలకు ఉచిత బస్సు, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్, సన్న ధాన్యానికి బోనస్ అమలుచేశామని చెప్పారు. ఉగాది పండుగ నుండి రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం సరఫరా చేస్తామని మంత్రి ప్రకటించారు. కాగా, యువతకు స్వయం ఉపాధి కోసం రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ప్రతీ నియోజకవర్గంలో 5వేల మందికి తగ్గకుండా రూ.4 లక్షల మేర సబ్సిడీ రుణాలు ఇస్తామని, రానున్న నాలుగేళ్లలో 20లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళా సంఘాలకు ప్రత్యేకంగా స్త్రీ టీ క్యాంటీన్లు మంజూరు చేశామని, త్వరలోనే రెండు పెట్రోల్ బంక్‌లు ప్రారంభిస్తామని తెలిపారు. కాగా, పెనుబల్లి మండలం రామచంద్రాపురం పర్యటనలో భాగంగా స్థానికులు మంత్రికి ఘనస్వాగతం పలికారు. అనంతరం రామచంద్రాపురం, ఏరుగట్లలో సమస్యలను విన్నవించారు. ఏళ్లుగా పోడు చేసుకుంటున్న భూముల నుంచి అటవీ అధికారులు ఖాళీ చేయించారని ఫిర్యాదు చేయగా , 20–25 రోజుల్లో సమస్య పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఆర్డీవో రాజేంద్ర గౌడ్, అటవీ అధికారులను మంత్రి ఆదేశించారు. అలాగే, సీతారామ ప్రాజెక్టు కాల్వ యాతాలకుంట నుండి కి.మీ. మేర పొడిగిస్తే సాగు నీరు అందుతుందని చెప్పగా నివేదిక సమర్పించాలని అధికారులకు సూచించారు. అంతేకాక మరో ఆరుగురికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు సర్వే చేయాలని తెలిపారు. ఈకార్యక్రమాల్లో రాష్ట్ర ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, కల్లూరు ఆర్డీఓ ఎల్.రాజేందర్, తహసీల్దార్ల గంటా ప్రతాప్, పులి సాంబశివుడు, ఎంపీడీఓలు అన్నపూర్ణ, దాసరి చంద్రశేఖర్, కల్లూరు మార్కెట్ చైర్మన్ భాగం నీరజాదేవితో పాటు నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్, వంకాయలపాటి వెంకటేశ్వరరావు, కీసర శ్రీనివాసరెడ్డి, సోమరాజు సీతారామారావు, పి.వెంకటేశ్వరరావు, చీకటి రామారావు, గూడూరు మాధవరెడ్డి, దొంతు మాధవరావు, ఈడీ కమలాకర్‌రావు, పోతురాజు కిషోర్, పిల్లి నవజీవన్, కరీముల్లా, రాజబోయిన కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంవన్‌టౌన్: ఏదులాపురం మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆళ్ల శ్రీనివాసరెడ్డి ఖమ్మంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

చివరిరోజు ఇద్దరు డిబార్

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారంతో ముగిశాయి. చివరిరోజు 16,476మంది విద్యార్థుల్లో 16,033మంది హాజరుకాగా 443మంది గైర్హాజరయ్యారని డీఐఈఓ రవిబాబు తెలిపారు. ఇదిలా ఉండగా మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతున్న ఇద్దరిని డీబార్ చేయగా, అన్ని పరీక్షల్లో కలిపి నలుగురు డీబార్ అయ్యారని వెల్లడించారు. జిల్లాలోని 35 పరీక్షా కేంద్రాలను హెచ్‌పీసీ, డీఈసీ, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయని ఆయన తెలిపారు.

నేటి నుంచి ఎస్సెస్సీ పరీక్షలు



ఖమ్మంలోని ఓ సెంటర్‌లో నంబర్లు వేస్తున్న ఉపాధ్యాయులు

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం నుంచి మొదలుకానున్నాయి. జిల్లా నుంచి పరీక్షలకు హాజరుకానున్న 16,788మంది విద్యార్థుల కోసం 97కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లతో అధికారులు సమావేశం నిర్వహించగా, పలు పాఠశాలల్లో గురువారం ఇన్విజిలేటర్లతో సమావేశాలు ఏర్పాటుచేసి సూచనలు చేశారు. ఉదయం 9–30నుంచి 12–30గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, 8–30గంటల నుంచే విద్యార్థులను అనుమతించాలని తెలిపారు. అలాగే, 9–35తర్వాత అనుమతి ఉండనే అంశంపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఇప్పటికే అన్ని కేంద్రాల్లో నంబర్లు వేయగా, తాగునీటి వసతి, వైద్యసదుపాయం కల్పిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఈ.సోమశేఖరశర్మ తెలిపారు.

పాఠశాలలకు చేరిన కంప్యూటర్లు



కంప్యూటర్లను పరిశీలిస్తున్న ఏఎంఓ

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) విధానంలో బోధన మొదలైన ఏడు పాఠశాలలకు అవసరమైన కంప్యూటర్లు, సామగ్రి చేరాయని విద్యాశాఖ ఏఎంఓ కె.రవికుమార్ తెలిపారు. ప్రస్తుతం ఇతర పాఠశాలల నుంచి తాత్కాలికంగా మూడేసి కంప్యూటర్లు కేటాయించి బోధిస్తుండగా ఇకపై కొత్త కంప్యూటర్లను వినియోగించనున్నారు. ఇన్వర్టర్లు, వై ఫై రూటర్లు, టేబుళ్లు కూడా రావడంతో పాఠశాలల్లో పూర్తిస్థాయి కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటుకానున్నాయి.

ఉపయోగపడకపోతే ఇచ్చేద్దాం...

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- జిల్లా కేంద్రంలోని పెద్దాస్పత్రి వద్ద 'వాల్ ఆఫ్ కైండ్‌నెస్' ప్రారంభం



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్‌శ్రేష్ట

ఖమ్మంమయూరిసెంటర్: ఇంట్లో మనకు పనికి రానివి ఇతరులకు ఉపయోగపడే అవకాశమున్నందున వాటిని ఇవ్వడానికి ముందుకు రావాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. జిల్లా ప్రధాన ఆస్పత్రి ఎదురుగా 'వాల్ ఆఫ్ కైండ్‌నెస్' పేరిట ఏర్పాటుచేసిన గోడను అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ట, డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్‌తో కలిసి గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇళ్లలో ఉపయోగపడని దుస్తులు, ఇతర సామగ్రిని ఇక్కడ వదిలేస్తే అవసరమైన వారు తీసుకెళ్తారని చెప్పారు. కాగా, సామగ్రిని శుభ్రం చేసి నిర్దేశిత షెల్ఫ్‌లో వేస్తే అవసరమైన వారికి మేలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ప్రవేశాలు పెరగాలి

ఖమ్మంఅర్బన్: అంగన్‌వాడీలకు చిన్నారులు ఆసక్తిగా వచ్చే అవకాశమున్నందున ప్రవేశాలు పెరిగేలా ప్రయత్నించాలని కలెక్టర్ సూచించారు. ఖమ్మంలోని యూపీహెచ్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని రూ.10లక్షలు వెచ్చించి బొమ్మలు, ఇతర ఏర్పాట్లతో ఆధునికీకరించగా అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్టతో కలిసి ప్రారంభించారు. ఇండస్ట్రియల్ ఏరియా, యూపీహెచ్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్న భవనాల్లో చిన్నారులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దడం బాగుందన్నారు. డీడబ్ల్యూఓ రాంగోపాల్‌రెడ్డి, సీడీపీఓ వీరభద్రమ్మ, ఉద్యోగులు నాగమణి, సునీత, మస్తాన్, సుమతి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో రబీ ధాన్యం కొనుగోలు చేసేందుకు పకడ్బందీగా ఏర్పాటుచేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి సమీక్షించిన ఆయన జిల్లాలో 2.58లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా ఉందన్నారు. ఇందులో 1.85వేల మెట్రిక్ టన్నుల సన్నరకం, 73వేల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యం ఉండనున్నందున 344 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఆపై ఆన్‌లైన్‌లో నమోదు, రవాణా, చెల్లింపులపై ఉద్యోగులకు అవగాహన కల్పించాలని సూచించారు. అంతేకాక సన్న రకం ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నందున ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు రాకుండా చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్, డీఎం శ్రీలత, డీఆర్‌డీఓ సన్యాసయ్య, డీపీఓ డి.పుల్లయ్య, డీఎంఓ ఎం.ఏ.అలీం, డీసీఓ గంగాధర్ పాల్గొన్నారు.

స్వశక్తితో ఆర్థిక స్వావలంబన సాధించాలి

పెనుబల్లి: మహిళలు స్వశక్తితో ఆర్థిక స్వావలంబన సాధించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. పెనుబల్లి ఐకేపీ కార్యాలయంలో ఐకేపీ సిబ్బంది, వీఏఓలు, సీసీలతో సమావేశమైన ఆయన డ్వాక్రా గ్రూపుల పని తీరు, మహిళా శక్తి ద్వారా స్త్రీ క్యాంటీన్ల ఏర్పాటుపై ఆరా తీశారు. మహిళా సంఘాల సభ్యులకు అండగా నిలిచేలా బ్యాంక్ లింకేజీ రుణాలు ఇప్పిస్తామని, తద్వారా కొత్త పథకాలు ప్రారంభించుకోవాలని సూచించారు. అలాగే, బాలికలకు తప్పనిసరి చదువు చెప్పించాలని సూచించిన కలెక్టర్... ఏళ్ల క్రితమే చదువుకున్న తన అమ్మమ్మ తనకు ప్రేరణగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. తహసీల్దార్ గంటా ప్రతాప్, ఎంపీడీఓ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గేట్‌లో ఆలిండియా 378వ ర్యాంక్

ఖమ్మంఅర్బన్: తాజాగా విడుదలైన గేట్ ఫలితాల్లో ఖమ్మం చైతన్యనగర్‌కు చెందిన దేవిశెట్టి సాయి మౌనిష్ ఆలిండియా 378వ ర్యాంక్ సాధించాడు. గత ఏడాది గేట్‌లో 1,304వ ర్యాంకు సాధించిన ఆయన ఒడిశాలోని నేషనల్ అల్యూమినియం కంపెనీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. మరోమారు పరీక్ష రాసిన ఆయన జనరల్ విభాగంలో 378వ ర్యాంకు సాధించడం విశేషం. కాగా, మౌనిష్ ఖమ్మంలోని న్యూవిజన్ పాఠశాల, కాలేజీలో చదివాక బీవీఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పూర్తిచేశాడని ఆయన తల్లిదండ్రులు పద్మజ - శ్రీనివాస్ తెలిపారు.

నేటి నుంచి నాటక పోటీలు

మధిర: ప్రజలను చైతన్యపరిచే పౌరాణిక కళలను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాటూరుపేట శ్రీ సీతారామాంజనేయ కళాపరిషత్ అధ్యక్షుడు గడ్డం సుబ్బారావు తెలిపారు. మధిర బంజారా కాలనీలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీ లక్ష్మీపద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు తెలుగు రాష్ట్రాల స్థాయి పౌరాణిక నాటక పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు కళాభిమానుల ఆదరించి కళాకారులను ప్రోత్సహించాలని కోరారు.

మేజర్ కాల్వకు గండి



గండి పడిన ప్రదేశం వద్ద అధికారులు

కల్లూరురూరల్: కల్లూరు మండలం బాలాజీనగర్ వద్ద ఎన్నెస్పీ పుణ్యపురం మేజర్ కాల్వకు గురువారం ఉదయం గండి పడింది. కాల్వ 6.5 కి.మీ. వద్ద సుమారు మూడు మీటర్ల వైశాల్యంలో గండి పడగా భారీ మొత్తం నీరు సమీపంలోని పంట పొలాలను ముంచెత్తింది. ఈ మేరకు ఎన్నెస్పీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మీనారాయణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రత్నాకర్ గండిపడిన ప్రాంతాన్ని పరిశీలించి కల్లూరు మధిర బ్రాంచ్ కెనాల్ నుంచి ప్రవాహాన్ని నిలిపివేయించారు. అనంతరం యుద్ధ ప్రాతిపదికన గండి పూడ్చివేస్తుండగా, త్వరలోనే ఆయకట్టుకు నీరందిస్తామని తెలిపారు.

శాంపిల్స్ తీసుకొచ్చే వాహనాలకు టెండర్లు

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ల్యాబ్‌ల నుంచి శాంపిల్స్‌ను ఖమ్మంలోని తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్‌కు తరలించేందుకు ఐదు వాహనాల కోసం టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ బి.కళావతిబాయి తెలిపారు. నెలకు 2,500 కి.మీ. మేర తిరగాల్సి ఉండగా, ఒక్కో వాహనానికి నెలకు రూ.33వేల అద్దె అందుతుందని పేర్కొన్నారు. ఐదేళ్ల లోపు వాహనాల రిజిస్ట్రేషన్ జరిగి, ఎల్లో ప్లేట్ కలిగిన ప్రైవేట్ ట్రావెల్స్ ఏజెన్సీల బాధ్యులు టెండర్లను తమ కార్యాలయంలోని బాక్స్‌లో ఈనెల 29 సాయంత్రంలోగా వేయాలని సూచించారు.

ములుగు మత్స్యకారులకు శిక్షణ ప్రారంభం



చేపలకు వచ్చే వ్యాధుల లక్షణాలను వివరిస్తున్న శాస్త్రవేత్త

కూసుమంచి: ములుగు జిల్లాకు చెందిన షెడ్యూల్డ్ తెగల మత్స్యకారుల(రెండో బ్యాచ్)కు మూడు రోజుల పాటు ఇచ్చే శిక్షణ మండలంలోని పాలేరులో శ్రీ పీ.వీ.నర్సింహారావు మత్స్య పరిశోధనా కేంద్రంలో గురువారం ప్రారంభమైంది. ఈసందర్భంగా చేపల పెంపకంలో పద్ధతులు, పిల్లల సంరక్షణ తదితర అంశాలపై ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్ అవగాహన కల్పించారు. అనంతరం వారిని ఫిషరీస్ కేంద్రాలకు తీసుకెళ్లి వివిధ రకాల చేపలు, రొయ్యల పెంపకం, వ్యాధుల నివారణ, దాణా తయారీ విధానాన్ని వివరించారు.

దగ్ధమైన ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించిన అధికారులు

రఘునాథపాలెం: మండలంలోని బావోజీతండాలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ఆయిల్‌పామ్ తోటలను నాలుగు శాఖల అధికారులు గురువారం పరిశీలించారు. విద్యుత్‌శాఖ ఎస్ఈ శ్రీనివాసచార్యులు, డీఈ రామారావు, ఏడీ సంజీవ్‌కుమార్, ఏఈ సతీష్, వ్యవసాయశాఖ ఏడీఏ కొంగర వెంకటేశ్వర్లు, ఏఓ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఉద్యానవన అధికారి నగేష్, ఆర్‌ఐలు సత్యనారాయణ, ప్రవీణ్ బాధిత రైతులతో మాట్లాడారు. ఈమేరకు బానోత్ పార్వతి, ప్రమీలకు చెందిన తొమ్మిది ఎకరాల తోటకు నష్టం జరిగిందని చెప్పగా, ఆయిల్ పామ్, శ్రీగంధం చెట్లతో పాటు డ్రిప్ ఇరిగేషన్ పైపులు కూడా కాలిపోయాయని వివరించారు. తోటలపై నుంచి వెళ్తున్న విద్యుత్ లైన్లను మార్చాలని కోరినా అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని రైతులు వాపోయారు. కాగా, నష్టం వివరాలతో ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని ఉద్యానశాఖ అధికారి నగేష్ తెలిపారు.

విద్యుత్ శాఖలో ఎమర్జెన్సీ బృందాలు

- ఆరుగురు చొప్పున ఐదు బృందాల ఏర్పాటు
- జీపీఆర్ఎస్ లొకేషన్ ఆధారంగా పయనం, సమస్యల పరిష్కారం



వాహనంలో సామగ్రితో వెళ్తున్న సిబ్బంది

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ సంబంధించి సేవలను యుద్ధ ప్రాతిపదికన అందించేలా ఎమర్జెన్సీ రిస్టోర్ టీం(ఈఆర్‌టీ)లను ఏర్పాటు చేస్తున్నారు. వేసవిలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తరచుగా విద్యుత్ సమస్యలు తలెత్తుతుంటాయి. ఇలాంటి సమస్యలను గుర్తించి సత్వరమే పరిష్కరించేలా ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాలతో ప్రత్యేక బృందాలను నియమిస్తున్నారు. ఇప్పటికే జిల్లాకు ఐదు వాహనాలను కేటాయించారు. ఇప్పటివరకు ఖమ్మం సర్కిల్‌లో ఐదు ఈఆర్‌టీలు ఏర్పాటు చేసి సేవలను ప్రారంభించారు. ఖమ్మం సర్కిల్‌లో ఖమ్మం టౌన్, ఖమ్మం రూరల్, వైరా, సత్తుపల్లి విద్యుత్ డివిజన్లు ఉన్నాయి. ఇందులో ఖమ్మం, వైరా డివిజన్లలో ఐదు బృందాలను ఆరుగురి చొప్పున సిబ్బందితో నియమించారు.

సమాచారం అందగానే...

ఎక్కడైనా విద్యుత్ సంబంధిత సమస్య ఎదురైనట్లు స్థానికులు ఫిర్యాదు చేసినా లేదా ట్రోల్ ఫ్రీ నంబర్ 1912 ద్వారా సమాచారం అందినా ఈఆర్‌టీ బృందం వెంటనే రంగంలోకి దిగుతుంది. ఈ సేవలకు జీపీఆర్ఎస్‌ను వినియోగించుకుంటున్నారు. స్థానికులు, విద్యుత్ సిబ్బంది సమస్య ఉన్న ప్రాంతం జీపీఆర్ఎస్ లొకేషన్ పెడితే ఈఆర్‌టీలు వాహనంలో బయలుదేరతారు. ఈ వాహనంలో థర్మో విజన్ కెమెరాలు, రంపాలు, టార్చ్‌లైట్లు, నిచ్చెనలు, ఇన్సులేటర్లు, కండక్టర్లు, కేబుల్ కూడా అందుబాటులో ఉంచుతున్నారు. ప్రస్తుతం ఈ సేవలను ఎన్పీడీసీఎల్ ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించినా 24గంటల అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు. కాగా, సర్కిల్ పరిధిలో వేసవి ప్రణాళికలో భాగంగా మరిన్ని ఈఆర్‌టీలను ఏర్పాటు చేసేందుకు కసరత్తు జరుగుతోంది.

సత్వర సేవల కోసం...



వినియోగదారులకు అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా ఈఆర్‌టీలను ఏర్పాటు చేశాం. ఈ బృందాలకు అవసరమైన వాహనాలు, సామగ్రిని సమకూర్చాం. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సమస్య ఎదురైన ప్రాంతాన్ని గుర్తించి ఆయా బృందాలు చేరుకుంటాయి.

– ఇనుగుర్తి శ్రీనివాసాచారి, ఎస్ఈ

సీఎం చేతుల మీదుగా కారుణ్య నియామక పత్రాలు



నియామక పత్రం అందుకుంటున్న ప్రవీణ్‌కుమార్

ఖమ్మంవన్‌టౌన్: పంచాయతీరాజ్ శాఖ పరిధిలో కారుణ్య నియామకాల ద్వారా 27 మందిని జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. జిల్లా పరిషత్, మండల పరిషత్‌లు, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పనిచేసిన పీఆర్ ఉద్యోగులు మరణించగా, వారి వారసులు చాన్నాళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. ఈనేపథ్యాన ప్రస్తుతం ప్రభుత్వం అవకాశం కల్పించగా హైదరాబాద్ రవీంద్రభారతిలో వీరికి సీఎం రేవంత్‌రెడ్డి గురువారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగపద్మజ నేతృత్వాన హైదరాబాద్ వెళ్లారు.

కమలాపురం వాసి...

ముదిగొండ: హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ముదిగొండ మండలం కమలాపురానికి చెందిన మరికంటి ప్రవీణ్‌కుమార్ సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా జూనియర్ టెక్నికల్ అధికారిగా నియామకపత్రం అందుకున్నారు. మరికంటి హుస్సేన్ - ధనలక్ష్మి దంపతుల కుమారుడు ప్రవీణ్‌కుమార్ ఇటీవల మిషన్ భగీరథలో జూనియర్ టెక్నికల్ అధికారిగా నియమితులయ్యాడు.

మూడు తప్ప అన్ని పదవులకు పోటాపోటీ

బార్ అసోసియేషన్ ఎన్నికలకు ముగిసిన నామినేషన్ల పర్వం

ఖమ్మం లీగల్: ఈనెల 27న జరగనున్న ఖమ్మం బార్ అసోసియేషన్ ఎన్నికలకు నామినేషన్ల గడువు గురువారంతో ముగిసింది. అధ్యక్ష స్థానానికి తొండపు వెంకటేశ్వరరావు, సుగ్గల వెంకటేశ్వర్ గుప్తా, అయ్యదేవర విజయరాఘవ, ప్రధాన కార్యదర్శి పదవికి తెల్లాకుల రమేష్‌బాబు, గద్దల దిలీప్, ఉపాధ్యక్ష పదవికి ఎస్.కే.జానీ మియా, జింజిరాల విజయశాంత, మల్లెం రవిప్రసాద్ నామినేషన్లు సమర్పించారు. అలాగే, సంయుక్త కార్యదర్శి పదవికి మేకల నవీన్, క్రీడా కార్యదర్శి పదవికి రాందాస్ నాయక్, కే.వీ.వీ.లక్ష్మి, గ్రంథాలయ కార్యదర్శి పదవికి దేరంగుల కళ్యాణి, సింగారపు రాంబాబు, కోశాధికారి పదవికి పి.నరసింహారావు, మహిళా ప్రతినిధి పదవికి పోరిక ఇందిర నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలన అనంతరం అభ్యర్థుల జాబితా విడుదల చేస్తామని ఎన్నికల అధికారి తెలిపారు. ఈ ఎన్నికల్లో 815 మంది న్యాయవాదులు ఓటు హక్కు వినియోగించుకోనుండగా, జాయింట్ సెక్రటరీ, ట్రెజరర్, మహిళా ప్రతినిధి పదవులకు ఒక్కొక్కటే నామినేషన్ రావడంతో వారు ఏకగ్రీవమైనట్లు ప్రకటించనున్నారు.

వ్యవసాయ రంగంపై కార్పొరేట్ల కన్ను

- నల్లచట్టాల అమలుకు కేంద్రం యత్నాలు
- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మహాసభల్లో రాష్ట్ర అధ్యక్షుడు హేమంతరావు



జెండా ఆవిష్కరిస్తున్న హేమంతరావు, నాయకులు

వైరా: వ్యవసాయ రంగంపై కార్పొరేట్ సంస్థల కన్ను పడగా.. రైతులను దూరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నల్లచట్టాల అమలుకు యత్నిస్తోందని తెలంగాణ రైతు సంఘం(సీపీఐ) రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు విమర్శించారు. సంఘం 21వ జిల్లా మహాసభలు వైరాలో గురువారం నిర్వహించారు. ఈమేరకు సంఘం పతాకాన్ని బండారుపల్లి ముత్తయ్య ఆవిష్కరించాక, ఫొటో ఎగ్జిబిషన్‌ను జమ్ముల జితేందర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం హేమంతరావు మాట్లాడుతూ నేటి పాలకులు జై కిసాన్.. జై జవాన్ బదులు జై అంబానీ, జై అదానీ అంటున్నారని ఎద్దేవా చేశారు. బ్యాంకులు సైతం రైతులకు రుణాలు ఇవ్వకపోగా, కార్పొరేట్ల సేవలో మునిగితేలుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గెలిచిన 100 రోజులల్లో అమలుచేస్తానన్న హామీలేవీ నెరవేరలేదని పేర్కొన్నారు. ఇకనైనా రైతులు, ప్రజలు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, నాయకులు దండి సురేష్, మహ్మద్ మౌలానా, ఎర్రా బాబు, వెంకటరెడ్డి, రంజిత్‌కుమార్, గోపాలరావు, సింగు నర్సింహారావు, తోట రామాంజనేయులు, రవీంద్రబాబు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, రాణి లతాదేవి, పుచ్చకాయల వెంకటేశ్వర్లు, జక్కుల రామారావు, బానోత్ రవి తదితరులు పాల్గొన్నారు.

వ్యయ నియంత్రణకే 'ఒకే దేశం - ఒకే ఎన్నిక'



మాట్లాడుతున్న కోటేశ్వరరావు, పక్కన శ్రీధర్‌రెడ్డి, సత్యనారాయణ, నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: దేశాన్ని సుపరిపాలన దిశగా తీసుకెళ్లడం, ఎన్నికల పేరుతో జరుగుతున్న రూ.వేల కోట్ల వ్యయాన్ని నియంత్రించేందుకు కేంద్రప్రభుత్వం 'ఒకే దేశం– ఒకే ఎన్నిక' విధానాన్ని తీసుకురానుందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడి ఇటీవల నియమితులైన నెల్లూరు కోటేశ్వరరావు అధ్యక్షతన ఖమ్మంలో జరిగిన సమావేశంలో శ్రీధర్‌రెడ్డి మాట్లాడారు. లోక్‌సభ, అసెంబ్లీకి ఒకేసారి ఎన్నికలు జరిగితే పాలన కుంటుపడకపోగా వ్యయం గణనీయంగా తగ్గుతుందన్నారు. అనంతరం కోటేశ్వరరావు ధర్మరక్షణ, ప్రజా శ్రేయస్సు, పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఎన్నెస్పీ కాలనీలోని రామాలయంలో ప్రమాణం చేశారు. ఈసందర్భంగా ఆయనను పలువురు సన్మానించారు. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, నాయకులు గెంటేల విద్యాసాగర్, నంబూరు రామలింగేశ్వరరావు, మందా సరస్వతి, శ్యాంరాథోడ్, కూసంపూడి రవీంద్ర, అల్లిక అంజయ్య, విజయరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందుకు బదులు గడ్డి మందు పిచికారీ

ఐదెకరాల్లో మాడిపోయిన వరి పంట



ఎండిపోయిన పంట

నేలకొండపల్లి: ఆరుగాలం కష్టపడి, అందిన దగ్గరల్లా అప్పులు తెచ్చి సాగుచేసిన వరి పంట చేతికందే సమయాన నిలువెల్లా మాడిపోయింది. పురుగుల నివారణ మందుకు బదులు గడ్డి నివారణ మందు పిచికారీ చేయడంతో ఈ పరిస్థితి ఎదురుకాగా రైతు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాడు. నేలకొండపల్లి మండలం చెన్నారానికి చెందిన గంజికుంటల చిన్న సంగయ్య ఐదెకరాల్లో వరి సాగు చేశాడు. పంటకు మెడ విరుపు తెగులు సోకడంతో నివారణ మందుకు బదులు ఆయన గడ్డి నివారణ మందు పిచికారీ చేశాడు. దీంతో పంట మొత్తం ఎండిపోవడంతో రూ.2లక్షల మేర పెట్టుబడి, పంట చేతికొస్తే అందే రూ.4లక్షల ఆదాయం కోల్పోయినట్లేనని కన్నీరుమున్నీరవుతున్నాడు.

వాతావరణంలో మార్పులు

పంటల రక్షణపై అధికారుల సూచనలు

ఖమ్మంవ్యవసాయం: వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. గురువారం మొదలైన ఈ మార్పులు శుక్ర, శనివారం కూడా కొనసాగనుండగా, పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. ఇందులో భాగంగానే గురువారం జిల్లాలోని పలుచోట్ల ఈదురుగాలులు, అక్కడక్కడా చిరుజల్లులు కురవగా, శుక్ర, శనివారాల్లో 30–40 కి.మీ.ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. కాగా, ప్రస్తుతం వరి, మొక్కజొన్నతో పాటు మామిడి సాగులో ఉంది. కూరగాయల పంటలు కూడా సాగు చేస్తుండగా అన్నీ కోత దశకు చేరాయి. ఈ సమయంలో ఈదురుగాలులు, వడగండ్ల వాన పడితే నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే, కోసిన వరి, మొక్కజొన్న, పెసర, మినుము పంటను జాగ్రత్త చేసుకోవాలని అధికారులు సూచించారు. టమాట, వంగ, బెండ, మిర్చి కోసుకోవాలని చెప్పారు. తాత్కాలికంగా పురుగు మందుల పిచికారీని నిలిపివేయాలని పేర్కొన్నారు. కాగా, వడగండ్ల వాన సూచనలు ఉన్నందున రైతులు చెట్ల కింద నిలబడిద్దని, పశువులు, గొర్రెలు, మేకలను చెట్ల కింద నిలపొద్దని తెలిపారు.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

తిరుమలాయపాలెం: మండలంలోని హైదర్‌సాయిపేటకు చెంది ఓ వ్యక్తి బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన బానోతు శ్రీను(35) మహబూబాబాద్ జిల్లా నల్లెల శివారు తండాలో భార్య అనిత, ఇద్దరు పిల్లలతో కలిసి 18ఏళ్లుగా ఉంటున్నాడు. గురువారం తెల్లవారుజామున బయలుదేరిన శ్రీను హైదర్‌సాయిపేట చేరుకుని బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, ఆయన ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కూసుమంచి: పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని గంగబండ తండాకు చెందిన బానోత్ ఉపేందర్(25) ఈనెల 14న పురుగుల మందు తాగగా హైదరాబాద్ తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ గురువారం మృతి చెందగా, అనారోగ్య కారణాలతో ఉపేందర్ ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదైంది.

ఎండ తట్టుకోలేక ఒకరు..

ఖమ్మంక్రైం: ఖమ్మం రైల్వేస్టేషన్ సమీపాన షాపుల వద్ద గుర్తుతెలియని వ్యక్తి (45) గురువారం మృతి చెందాడు. దీంతో స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు చేరుకుని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో మృతదేహన్ని మార్చురీకి తరలించారు. కాగా, ఎండ తీవ్రత తట్టుకోలేక సదరు వ్యక్తి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలుశిక్ష

ఖమ్మం లీగల్: తీసుకున్న అప్పు చెల్లించే క్రమాన జారీ చేసిన చెక్కు చెల్లకపోవడంతో వ్యక్తికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి బెక్కం రజని గురువారం తీర్పు చెప్పారు. ఖమ్మం బాలపేటకు చెందిన వడ్లమూడి నాగేశ్వరరావు వద్ద చావా రామయ్యనగర్‌కు చెందిన ఎం.డీ.యహియాఖాన్ అబ్దుల్ 2018 జూన్ 3న రూ.4.50 లక్షల అప్పు తీసుకున్నాడు. ఈ అప్పులు చెల్లించేందుకు 2020 డిసెంబర్ 14న రూ.7 లక్షలకు చెక్కు జారీ చేశాడు.అయితే, ఆ చెక్కును బ్యాంక్‌లో జమ చేసే అబ్దుల్ ఖాతాలో సరిపడా నగదు లేక తిరస్కరణకు గురైంది. దీంతో న్యాయవాది కె.రాజేశ్వరరావు ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసిన నాగేశ్వరరావు కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశాడు. విచారణ అనంతరం ఆరు నెలల జైలుశిక్ష విధించడమేకాక ఫిర్యాదికి రూ.7లక్షలు చెల్లించాలని తీర్పు చెప్పారు.

ఇతరుల స్థలాన్ని అమ్మిన కేసులో ఇద్దరి అరెస్ట్

రఘునాథపాలెం: ఇతరుల ఇంటి స్థలాన్ని తమదిగా చూపించి రూ.18లక్షలకు అమ్మిన నలుగురిపై కేసు నమోదు చేయగా, అందులో ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం నాయుడుపేటకు చెందిన మానుకొండ శ్రీనివాస్, పోలేపల్లికి చెందిన వెలుతురు శ్రీనివాస్ రఘునాథపాలెం రెవెన్యూలో ఇతరుల 200 గజాల ప్లాట్‌ను తమదిగా చెబుతూ కాకుమాని రామారావుకు రూ.18 లక్షలకు అమ్మారు. ఈమేరకు రామారావు ఫిర్యాదుతో నలుగురిపై ఖమ్మం సీసీఎస్‌లో కేసు నమోదైంది. నిందితుల్లో ఇద్దరిని గురువారం అరెస్టు చేసి కోర్టు ఆదేశాలతో రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

పెనుబల్లి: మండలంలోని ముత్తగూడెం శివారు చెరువుగట్టు వద్ద పలువురు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు గురువారం తనిఖీలు చేపట్టారు. ఈమేరకు ఐదుగురు పట్టుబడగా, మరికొందరు పారిపోయారు. పట్టుబడిన వారి నుంచి రూ.3,300నగదు, మూడు బైక్‌లు, ఒక టాటా ఏస్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

291 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

ఖమ్మంఅర్బన్: హైదరాబాద్ నుంచి వచ్చిన టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు ఖమ్మంలో గురువారం చేపట్టిన తనిఖీల్లో ఏపీ రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్న తరలిస్తున్న 291 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడింది. టాస్క్‌ఫోర్స్ విభాగానికి చెందిన అంజయ్య, పాషా సహా నలుగురు, ఖమ్మం అర్బన్, రూరల్ సివిల్ సప్లయిస్ డీటీలు ఎం.వెంకటేష్, విజయ్‌బాబుతో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈమేరకు రెండు బొలేరో వ్యాన్లు, ఒక లారీలో ఏపీకి తరలించడానికి బియ్యంతో వెళ్తుండగా ఖమ్మంలోని మమత రోడ్డులో అడ్డుకున్నారు. ఈమేరకు బియ్యంను సివిల్ సప్లయిస్ గోదాంలో నిల్వ చేయగా, ఖమ్మం అర్బన్ పోలీసులు విచారణ చేపట్టారు. కాగా, నగరంలోని పలు ప్రాంతాల దళారులు సేకరించిన బియ్యాన్ని ఏపీ తరలిస్తున్నట్లు సమాచారం.

ప్రైవేట్ ఆస్పత్రిని సీజ్ చేసిన డీఎంహెచ్‌ఓ



ప్రైవేట్ ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ

కొణిజర్ల: కొణిజర్లలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కళావతిబాయి గురువారం సీజ్ చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సైదులు, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వెంకటరమణ, మాస్ మీడియా అధికారి సాంబశివారెడ్డితో కలిసి అస్పత్రిని గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంబీబీఎస్ వైద్యుడి పేరిట ఆర్ఎంపీ ఆస్పత్రిని నిర్వహిస్తున్నట్లు తేలింది. అంతేకాకుండా అనుమతి లేకుండా పడకలు ఏర్పాటు చేసి వైద్యం చేస్తున్నారని గుర్తించడంతో సీజ్ చేశారు. తొలుత డీఎంహెచ్‌ఓ కొణిజర్ల పీహెచ్‌సీని తనిఖీ చేసి వైద్యసేవలు, ఓపీ రికార్డులు, మందుల లభ్యతపై ఆరా తీశారు. వైద్యాధికారి ఏ.శారద, ఉద్యోగి సాంబశివరావు పాల్గొన్నారు.

'సీతారామ' నిధుల కోసం త్వరలోనే ఉద్యమం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సుదర్శన్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రావు, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: సీతారామ ప్రాజెక్టు కోసం 2002 నుండి సీపీఎంతో పాటు పలు పార్టీల పోరాడగా నాటి కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిందని.. అప్పటి నుంచి సరిపడా నిధులు కేటాయించని పాలకులు అంచనా వ్యయం మాత్రం పెంచుతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు విమర్శించారు. ఖమ్మంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ రూ.2 వేల కోట్ల అంచనాతో ప్రారంభించిన ప్రాజెక్టు నేడు రూ.19 వేల కోట్లకు చేరినా సరైన నిధులు కేటాయించడం లేదన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లోనూ సీతారామ ప్రాజెక్టుకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.643 కోట్లే కేటాయించడంతో ప్రాజెక్టును పూర్తి చేసే ఉద్దేశం ఉందా, లేదా అని ప్రశ్నించారు. జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉన్నా బడ్జెట్‌లో న్యాయం జరగలేదని, గతంలో బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేసిందని చెప్పే కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఏమి సమాధానం చెబుతుందన్నారు. కాగా, సీతారామ ప్రాజెక్టుకు నిధుల సాధన కోసం త్వరలోనే ఉద్యమానికి శ్రీకారం చుట్టనున్నట్లు పోతినేని తెలిపారు. అలాగే, బడ్జెట్‌లో వ్యవసాయ, విద్య, వైద్య తదితర రంగాలకు అరకొర నిధులు కేటాయించారని విమర్శించారు. కాగా, గాజాపై ఇజ్రాయిల్ మళ్లీ దాడులు చేయడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యాన ఖమ్మంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు నున్నా నాగేశ్వరరావు, నాయకులు యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, బండి రమేష్, మడుపల్లి గోపాలరావు, నందిపాటి మనోహర్, నాగుల్‌మీరా, బోడపట్ల సుదర్శన్, ఆర్.ప్రకాశ్, నర్రా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 25నుంచి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఐదు మహాసభలు వచ్చేనెల 25నుంచి 27వరకు ఖమ్మంలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు వెల్లడించారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.సుధాకర్, తుడుం ప్రవీణ్‌తో కలిసి గురువారం ఆయన మాట్లాడారు. ఇరవై ఏళ్ల ఖమ్మంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్న నేపథ్యాన విద్యారంగ సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. కాగా, అసెంబ్లీలో తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. గతంతో పోలిస్తే కేవలం 0.2శాతం పెంచారని, స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ఊసెత్త లేదని తెలిపారు. ఇక ఓయూ బాధ్యులు నియంతృత్వ విధానాలను విడనాడాలని, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను కార్పొరేట్ శక్తులను అప్పగించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని నాగరాజు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు వినోద్, పూజిత, మనోజ్, త్రినాథ్, లోకేష్ ,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్లలో అదనపు ఫీడర్ బ్రేకర్లు

రఘునాథపాలెం: వేసవి కార్యాచరణలో భాగంగా అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా కోసం పలు చోట్ల సబ్‌స్టేషన్లలో అదనపు ఫీడర్ బ్రేకర్లు ఏర్పాటుచేస్తున్నారు. ఈ సందర్భంగా రఘునాథపాలెం మండలం మంచుకొండ సెక్షన్ ఈర్లపుడి, బావోజీతండా సబ్‌స్టేషన్లలో ఫీడర్ బ్రేకర్లను గురువారం ఎన్పీడీసీఎల్ సీజీఎం తేజావత్ సదర్‌లాల్ ప్రారంభించారు. సుమారు రూ.13లక్షలతో వీటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రఘునాథపాలెం ఏడీఈ ఎం.సంజీవకుమార్, ఏఈ సతీష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

రేపు న్యాయ సేవాధికార సంస్థ పరీక్షలు

ఖమ్మం లీగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో ఉద్యోగాల భర్తీకి ఈనెల 22న పరీక్ష నిర్వహించనున్నారు. స్టెనో, టైపిస్ట్, టైపిస్ట్ కం అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్ తదితర ఉద్యోగాలకు గతంలో దరఖాస్తులు స్వీకరించారు. ఈమేరకు అభ్యర్థులకు 22వ తేదీన ఎస్సార్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో పరీక్ష నిర్వహిస్తున్నట్లు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి చంద్రశేఖరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

యువర్స్

● ఆర్ట్ అండ్ కల్చర్

రోహిట్



చిన్నప్పటి నుంచి టీవీల్లో డ్యాన్స్ షోలు చూస్తూ డాన్సర్ కావాలనుకునేవాడు రోహిత్ సరాఫ్. వెండితెరపై కుమారుడిని చూడాలని కలలు కనేవాడు అతడి తండ్రి. అయితే తన కల నెరవేరే భాగ్యాన్ని చూడలేదు. రోహిత్ పన్నెండేళ్ల ఉన్నప్పుడు తండ్రి చనిపోయాడు.

'నాన్న ఆత్మకు శాంతి చేకూరాలంటే నేను నటుడిని కావాల్సిందే' అని బలంగా డిసైడైపోయాడు రోహిత్.

దిల్లీ నుంచి ముంబైకి వచ్చిన సరాఫ్ ఒక టీవీ చానల్ యూత్ షోకు హాజరయ్యాడు. కెమెరా ముందుకు రావడం కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టినట్లుగా అనిపించింది.

'బాగా కష్టపడితేగానీ ఇక్కడ నెగ్గుకు రాలేం' అనుకున్నాడు. మొదటి సంవత్సరం రెండు టీవీ షోలలో నటించే అవకాశం వచ్చింది. ఆ తరువాత యాడ్స్‌లో, ఒక సినిమాలో అవకాశం వచ్చింది.

అయితే...తొలి సినిమా షూట్ చేసిన రెండున్నరేళ్ల తరువాత అది ఆగిపోయిందని తెలుసుకున్నాడు. బాగా నిరాశకు గురయ్యాడు. ఆడిషన్స్‌కు కూడా వెళ్లేవాడు కాదు. దీంతో ఎవరి నుంచి పిలుపు వచ్చేది కాదు. మరోవైపు ఆర్థిక ఇబ్బందులు. ఆ చీకటి రోజులలో 'ఇలా అయితే ఎలా?' అని తనకు తానే ప్రశ్న వేసుకున్నాడు. మళ్లీ కష్టపడాలని గట్టిగా అనుకున్నాడు. 'ప్రతిరోజూ కొండంత ధైర్యంతో, కోటి కలలతో నిద్ర లేవాలి అనుకున్నాను' అని గతాన్ని గుర్తు తెచ్చుకున్నాడు.

డియర్ జిందగీ, హిచ్కీ, ది స్కై ఈజ్ పింక్‌లాంటి చిత్రాల్లో అవకాశాలు వచ్చాయి. 'యస్...నాకు భవిష్యత్తు ఉంది' అనే ఆశాకిరణం ఉజ్వలంగా మెరిసింది. నెట్‌ఫ్లిక్స్ సిరీస్ 'మిస్‌మ్యాచ్‌డ్' తన కెరీర్‌కు టర్నింగ్ పాయింట్ అయింది. ప్రస్తుతం మణిరత్నం–కమల్‌హాసన్ సినిమాలో, ధర్మ ప్రొడక్షన్‌లాంటి పెద్ద సంస్థ సినిమాలో నటిస్తున్నాడు. 'కలలు అనేవి పిరికి వాళ్ల కోసం కాదు. ధైర్యంగా ఉండే వ్యక్తుల కోసమే' అంటున్న 28 సంవత్సరాల రోహిత్ సరాఫ్ ఫోర్బ్స్ ఇండియా '30 అండర్ 30' జాబితాలో చోటు సాధించాడు.

ఏకాగ్రత పెరుగుతుంది

చదువు అనేది మహా సముద్రం లాంటిది. మనం నేర్చుకోవడానికి ఎన్నో ఉన్నాయి. మనం ఎప్పుడూ నిత్య విద్యార్థిగా ఉండాలి' క్లాసురూమ్‌లో విన్న ఇలాంటి మాటలు ఎప్పటికప్పుడు కొత్త కోర్సులు నేర్చుకునేలా చేసింది. కొత్త కోర్సులు చేయడం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది. ఐఏఎస్ చేయాలనేది నా లక్ష్యం.
- బి. ప్రవల్లిక

175 ఆన్‌లైన్ కోర్సులు
నాన్‌స్టాప్ లెర్నర్



పది విషయాలు నేర్చుకున్నప్పుడు కూడా... నేర్చుకోవడానికి మరో పది విషయాలు రెడీగా ఉంటాయి. 'నేర్చుకోవడానికి నేను రెడీ' అనుకుంటే మీరే విజేత. అలాంటి ఒక విజేత... బి. ప్రవల్లిక. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 175 ఆన్‌లైన్ కోర్సులు పూర్తి చేసి 'ఔరా' అనిపించింది...

విశాఖ జిల్లా భీమిలిలోని 'కస్తూర్బా గాంధీ విద్యాలయం'లో పదవ తరగతి చదువుతున్న బి. ప్రవల్లిక చదువులో ముందుండడమే కాకుండా పలు కోర్సులలో విశేష ప్రతిభ చూపుతూ ప్రశంసలు అందుకుంటోంది. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురానికి చెందిన ప్రవల్లిక తండ్రి కోవిడ్ వల్ల చనిపోయారు. తల్లి ప్రైవేటు కంపెనీలో పని చేస్తోంది.



ఆన్‌లైన్ కోర్సుల హవా...

గతంలో సమగ్ర శిక్ష అభియాన్‌ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌గా పని చేసిన బి.శ్రీనివాసరావు ఇక్కడి విద్యార్థినులు ఆధునిక కోర్సులు నేర్చుకుంటే భవిష్యత్తులో వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందనే ఉద్దేశంతో ఇన్ఫోసిస్ వారి సహకారాన్ని తీసుకున్నారు. కోర్సుల కోసం 20 మందిని ఎంపిక చేశారు. ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారం ద్వారా కోర్సులను ఎంపిక చేసుకోవలసి ఉంటుంది. ఎంపిక చేసుకున్న కోర్సులకు సంబంధించిన సమాచారం, సూచనలు అందిస్తారు. ఆ తరువాత ఆన్‌లైన్‌లో నిర్వహించే పరీక్షల్లో పాల్గొనాలి. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, రోబోటిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటాబేస్, డ్రోన్... మొదలైన వాటితోపాటు మొత్తం 175 కోర్సులు పూర్తి చేసింది ప్రవల్లిక. కోర్సును బట్టి కొన్ని గంటలు లేదా ఒకటి, రెండు రోజుల్లో నేర్చుకుని పరీక్షల్లో పాల్గొంటూ మంచి మార్కులు పొందుతూ సర్టిఫికెట్లు సాధించింది.

నాడు... నేడు

గత ప్రభుత్వ హయాంలో జరిగిన 'నాడు-నేడు' పనుల ద్వారా ఎన్నో సదుపాయాలు అందుబాటులోకి రావడం వల్ల ఆన్‌లైన్ కోర్సుల అభ్యాసనకు వీలు కలిగింది. రూ. 51 లక్షలతో అదనపు గదులు, విద్యార్థినులు ప్రశాంతంగా చదువుకోవడానికి పెద్ద షెడ్డు, అవసరమైన ఇతర సదుపాయాల కల్పన జరిగింది.

'ఆసక్తి ఉన్నచోటే ప్రతిభ ఉంటుంది. ప్రవల్లికకు కొత్త విషయాలపై ఎంతో ఆసక్తి ఉంది. ఆ ఆసక్తే ఆమెను 175 కోర్సులు పూర్తి చేసేలా చేసింది. భవిష్యత్తులో తన చదువుకు ఈ కోర్సులు ఎంతగానో ఉపయోగపడతాయి. 175 కోర్సులు పూర్తి చేయడం అనేది ఆమెకే కాదు విద్యాలయానికి గర్వకారణం' అంటుంది కేజీబీవీ ప్రిన్సిపాల్ గంగా కుమారి.

టార్గెట్... ఐఏఎస్

ఎంతోమంది ఐఏఎస్ అధికారుల విజయగాథలను క్లాస్ రూమ్‌లో వింటున్నప్పుడు ప్రవల్లిక మదిలో 'ఐఏఎస్' కలకు బీజం పడింది. 'లక్ష్యసాధనకు మన ఆర్థిక స్థితిగతులతో పని లేదు. కడు పేదరికంలో పుట్టిన వారు కూడా ఎంతో కష్టపడి తమ లక్ష్యాన్ని నెరవేర్చుకున్నారు. మనకు కావాల్సింది సాధించాలనే పట్టుదల మాత్రమే'... ఇలాంటి మాటలు ఎన్నో ప్రవల్లికకు స్ఫూర్తినిచ్చి 'ఐఏఎస్' లక్ష్యానికి బలాన్ని ఇచ్చాయి.

– సింగారెడ్డి రమణప్రసాద్, సాక్షి, భీమిలి

● టెక్... టాక్



షావోమీ 15 ఆల్ట్రా

డిస్‌ప్లే: 6.73 అంగుళాలు
రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జడ్
మెమోరీ: 256జీబి 12జీబి ర్యామ్/ 512జీబి 16జీబి ర్యామ్
వోఎస్: ఆండ్రాయిడ్ 15
ఫ్రంట్ కెమెరా: 32ఎంపీ
బ్యాటరీ: 5410 ఎంఏహెచ్
రిజల్యూషన్: 1440x3200 పిక్సెల్స్



షావోమీ ప్యాడ్ 7 ప్రో

హైట్: 251.22 ఎంఎం; విడ్త్:173.42 ఎంఎం
బరువు: 500 గ్రా. స్క్రీన్ సైజ్: 11.2
రిఫ్రెష్ రేట్: 144 హెచ్‌జడ్
వోఎస్: షావోమీ హైపర్ వోఎస్ 2
ఫ్రంట్ కెమెరా: 32 ఎంపీ
బ్యాటరీ: 8850 ఎంఏహెచ్
కలర్స్: గ్రే, బ్లూ, గ్రీన్

గెలాక్సీ ఏ సిరీస్

శాంసంగ్ తన పాపులర్ గెలాక్సీ ఏ సిరీస్ కోసం మూడు కొత్త డివైజ్‌లను యాడ్ చేసింది. అవి: గెలాక్సీ ఏ 56, గెలాక్సీ ఏ 36, గెలాక్సీ ఏ26. గెలాక్సీ ఏఐని మరింత యాక్సెస్ చేసే లేటెస్ట్ మిడ్ రేంజ్ శాంసంగ్ స్మార్ట్‌ఫోన్‌లు ఇవి.
గెలాక్సీ ఏ56
8జీబి ర్యామ్: 128 జీబి స్టోరేజ్
గెలాక్సీ ఏ 36 : 8జీబి ర్యామ్: 128 జీబి స్టోరేజ్



మెరుపు వీరుడు

● గేమింగ్

'కొండలు, కోనలు మనకి అడ్డంకి కాదు' అనుకునే సాహసికులకు స్వాగతం పలికే గేమ్ ఇది.

మిస్టీరియస్ పాయింట్స్‌ను అవగాహన చేసుకుంటూ అనుభవజ్ఞానాన్ని సొంతం చేసుకునే సాధకులకు దారి చూపే గేమ్ ఇది. గెరిల్లా యుద్ధంలో రాటు తేలిన యోధులకు వీర తిలకం దిద్దే గేమ్ ఇది. యాక్షన్ రోల్–ప్లేయింగ్ గేమ్ అసాసిన్స్ క్రీడ్ షాడోస్ విడుదల అయింది. అసాసిన్స్ క్రీడ్ సిరీస్‌లో వస్తున్న 14వ మేజర్ ఇన్‌స్టాల్‌మెంట్ ఇది. 16వ శతాబ్దంలో సెంగోకు కాలానికి చెందిన కథ నేపథ్యంలో రూపొందించిన ఈ గేమ్‌లో జపాన్ అంతర్యుద్ధ సంఘటనలు కనిపిస్తాయి. తన శక్తియుక్తులతో టకేడా వంశంపై విజయం సాధిస్తాడు ఓడా నోబునాగా. ఒళ్లు గగుర్పొడిచే యుద్ధాలే కాదు నిలువెత్తు కోటలు, అలంకరించబడిన వాస్తు శిల్పాలు, సందడిగా ఉండే ఓడ రేవులు... మొదలైనవి ఎన్నో ఈ ఆటలో కనిపిస్తాయి. రకరకాల మిషన్‌ల ద్వారా వివిధ క్యారెక్టర్‌లకు మారే అవకాశం ప్లేయర్స్‌కు ఉంటుంది. సరికొత్త ఫీచర్‌లతో ప్లేయర్స్‌కు సినిమాటిక్ ఫైటింగ్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది.

సిరీస్: అసాసిన్స్ క్రీడ్
మోడ్స్: సింగిల్–ప్లేయర్
ప్లాట్‌ఫామ్: ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్/ మాక్ వోఎస్/ఐపాడ్ వోఎస్
జానర్స్: యాక్షన్ రోల్–ప్లేయింగ్



● ఇడియమ్స్

ఛ్యూ ద కడ్
ఒక విషయం లేదా సంఘటనకు సంబంధించి లోతుగా ఆలోచించడం, విశ్లేషించడానికి సంబంధించి వాడే మాట... ఛ్యూ ద కడ్. ఉదా: ఆఫ్టర్ దీ మీటింగ్, శ్రీను టుక్ టైమ్ టు ఛ్యూ ద కడ్ ఆన్ దెయిర్ న్యూ ప్రాజెక్ట్ ప్రపోజల్

ఫోమ్ ఎట్ ద మౌత్
తట్టుకోలేని కోపం, అసహనానికి గురయ్యే సందర్భంలో వాడే మాట... ఫోమ్ ఎట్ ద మౌత్.
ఉదా: ది సీయివో బిగెన్ టు ఫోమ్ ఎట్ ద మౌత్ వెన్ హీ డిస్కవర్డ్ ది ఫైనాన్షియల్ లాసెస్.



సాక్షి సినిమా

ధమ ధమ ధమ విశ్వలింగ...


● మోహన్ బాబు

విష్ణు మంచు హీరోగా నటించిన చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో ప్రీతీ ముకుందన్ హీరోయిన్‌గా నటించారు. మోహన్‌బాబు, బ్రహ్మానందం, ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌లాల్, శరత్ కుమార్, కాజల్ అగర్వాల్ ఇతర కీలక పాత్రలు పోషించారు. మంచు మోహన్‌బాబు నిర్మించిన ఈ మూవీ ఏప్రిల్ 25న విడుదల కానుంది. కాగా మార్చి 19న మోహన్‌బాబు పుట్టినరోజు. ఈ సందర్భంగా 'కన్నప్ప'లో మోహన్‌బాబు చేసిన మహదేవ శాస్త్రి పాత్ర పరిచయ గీతానికి సంబంధించిన గ్లింప్స్ విడుదల చేశారు. 'ధమ ధమ ధమ విశ్వలింగ... ధిమి ధిమి ధిమి విశ్వ లింగ....' అంటూ ఈ పాట సాగుతుంది. స్టీఫెన్ దేవస్సీ స్వరపరచిన ఈ పాటకు సుద్దాల అశోక్ తేజ సాహిత్యం అందించగా శంకర్ మహదేవన్ ఆలపించారు.

నా హృదయం నిండిపోయింది
- చిరంజీవి



''హౌస్ ఆఫ్ కామన్స్–యుకె పార్లమెంట్‌లోని కొందరు పార్లమెంట్ సభ్యులు, మంత్రులు, అండర్ సెక్రటరీలు, దౌత్యవేత్తలచే గౌరవించబడటం గౌరవంగా భావిస్తున్నాను. నా హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది'' అని హీరో చిరంజీవి తెలిపారు. నాలుగున్నర దశాబ్దాలుగా కళారంగానికి, సమాజానికి చిరంజీవి చేసిన సేవలకుగానూ యుకె పార్లమెంట్ హౌస్ ఆఫ్ కామన్స్‌లోని కొందరు ఎంపీలు, మంత్రుల చేతులమీదుగా ఈ నెల 19న(బుధవారం) చిరంజీవికి గౌరవ సత్కారం జరిగింది. అలాగే సినిమా, ప్రజా సేవ, దాతృత్వానికి ఆయన చేసిన కృషిని గుర్తించిన యూకేకి చెందిన 'బ్రిడ్జ్ ఇండియా' అనే సంస్థ తొలిసారి అందించిన 'జీవిత సాఫల్య పురస్కారం' కూడా అందుకున్నారు చిరంజీవి. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియాలో స్పందిస్తూ–''మాటలు సరిపోవు. అద్భుతమైన ప్రేమాభిమానాలను చూపించే అభిమానులు, రక్త దాతలు, నా సినీ కుటుంబం, శ్రేయోభిలాషులు, స్నేహితులు, నా కుటుంబ సభ్యులు, నా ప్రయాణంలో ఎంతగానో సహకరించిన వారు, నేను మానవతా దృక్పథంతో చేపట్టిన కార్యక్రమాల్లో పాల్గొన్న వారందరికీ థ్యాంక్స్. ఈ గౌరవం నన్ను మరింత ఉత్సాహంతో పని చేయడానికి ప్రేరేపిస్తుంది'' అన్నారు.


● శిరీష్, హర్షిత్, 'దిల్' రాజు, హనీఫ్, హర్షిత, సునీత

మల్టీస్టారర్‌కి శ్రీకారం

ప్రముఖ నిర్మాత 'దిల్' రాజు 'మార్కో' మూవీ చిత్ర దర్శకుడు హనీఫ్ అదేనితో ఓ మల్టీస్టారర్ మూవీకి శ్రీకారం చుట్టారు. శిరీష్ సమర్పణలో 'దిల్' రాజు ప్రొడక్షన్స్‌పై హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించనున్న ఈ కొత్త చిత్రాన్ని గురువారం ప్రకటించారు. ''మలయాళంలో బ్లాక్ బస్టర్ అయిన 'మార్కో'తో దర్శకుడు హనీఫ్ అదేని పేరు బాగా ట్రెండ్ అయింది. అలాంటి ఓ క్రేజీ డైరెక్టర్‌తో హై బడ్జెట్‌తో పాన్ ఇండియా మల్టీస్టారర్ ఫిల్మ్‌ని ప్రకటించడం సంతోషంగా ఉంది. ఈ మూవీతో హనీఫ్ తెలుగులోకి ఎంట్రీ ఇస్తున్నారు. గురు ఫిల్మ్స్ సునీత తాటి ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వామి అయ్యారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే తెలియజేస్తాం'' అని మేకర్స్ పేర్కొన్నారు.

భాగ్యనగరం అంతా మనదే మనదే...


● వైష్ణవీ చైతన్య, సిద్ధు జొన్నలగడ్డ

''ఈ పనిని ఇలానే ఎందుకు చేయాలి? మరోలా చేస్తానని కొందరు అంటుంటారు. అలాంటివాళ్లని క్రాక్ అంటుంటాం. 'జాక్: కొంచెం క్రాక్' రైమింగ్‌తో పాటు హీరో క్యారక్టరైజేషన్ కూడా ఈ సినిమాకు ఈ టైటిల్ పెట్టడానికి కారణం అయ్యింది. ఈ సినిమాలో ప్రేక్షకులను నవ్విస్తూనే, బాధ్యతగా ఉండే పాత్రలో కనిపిస్తాను'' అని సిద్ధు జొన్నలగడ్డ అన్నారు. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా 'బొమ్మరిల్లు' భాస్కర్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'జాక్: కొంచెం క్రాక్'. వైష్ణవీ చైతన్య హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర పతాకంపై బి. బాపినీడు సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానుంది. ఈ సినిమాలోని 'కిస్' పాట లిరికల్ వీడియోను గురువారం రిలీజ్ చేశారు మేకర్స్. 'భాగ్యనగరం అంతా మనదే మనదే...' అంటూ ఈ 'కిస్' సాంగ్ సాగుతుంది. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ– ''ఈ సినిమాలోని హీరో క్యారెక్టరైజేషన్ గురించి భాస్కర్‌గారు చెప్పగానే ఈ సినిమా చేయడానికి ఒప్పుకున్నాను. నేనూ ఓ రైటర్‌ని కాబట్టి కొన్ని ఇన్‌పుట్స్ ఇచ్చాను. భాస్కర్‌గారు ఆయన కథకు అనుగుణంగా డెవలప్ చేశారు'' అన్నారు. ''సిద్ధు యూత్‌కి మాత్రమే కాదు అన్ని ఏజ్‌ల వారికీ స్టార్ బాయ్‌గా మారారు. 'జాక్' సినిమాను భాస్కర్ చాలా చక్కగా హ్యాండిల్ చేశాడు'' అన్నారు బీవీఎస్ఎన్ ప్రసాద్. ఈ చిత్రం పాటల రచయిత సనారె, మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ బొబ్బిలి మాట్లాడారు.

శారీ చూశాక అమ్మాయిలు జాగ్రత్త పడతారు
- రామ్‌గోపాల్ వర్మ


● సత్య యాదు, రామ్‌గోపాల్ వర్మ, ఆరాధ్య, గిరి కృష్ణకమల్

''సోషల్ మీడియాలో వ్యక్తిగత విషయాలు షేర్ చేసుకోవడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది? అనే నేపథ్యంలో 'శారీ' రూపొందింది. నేనీ చిత్రానికి మూల కథ రాశాను. గిరి కృష్ణకమల్ దర్శకత్వం వహించాడు. 'శారీ'లో సందేశం ఉంటుందని చెప్పను గానీ, ఈ సినిమా చూశాక అమ్మాయిలు జాగ్రత్త పడతారు'' అని రామ్‌గోపాల్ వర్మ చెప్పారు. సత్య యాదు, ఆరాధ్యా దేవి ప్రధాన పాత్రల్లో గిరి కృష్ణకమల్ దర్శకత్వం వహించిన చిత్రం 'శారీ'. ఆర్జీవీ, ఆర్వీ ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై రవిశంకర్ వర్మ నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్ 4న తెలుగు, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో విడుదలవుతోంది. ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌లో రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ– ''రాజకీయాలు, సినిమాలు వేర్వేరు. ఆంధ్రప్రదేశ్‌లో మా సినిమాకు థియేటర్స్ దొరకవని అనుకోవడం లేదు. ఏదైనా చట్ట ప్రకారమే జరుగుతుంది. పోసాని కృష్ణమురళిగారిని అరెస్ట్ చేస్తే ఆయన సినిమాలు ఆపేయరు కదా? తాము చేస్తున్న యాడ్స్ లీగలా? కాదా? అనేది యాక్టర్స్‌కు, స్టార్స్‌కు తెలియకపోవచ్చు. దానిపై అధికారులు నటీనటులకు అవగాహన కల్పించాలి. అంతేగానీ సడెన్‌గా చర్యలు తీసుకోవడం సరికాదు'' అన్నారు. ''ఆరాధ్య, సత్య బాగా నటించడం వల్ల దర్శకుడిగా నాపై ఒత్తిడి తగ్గింది'' అని గిరి కృష్ణకమల్ చెప్పారు. ''ఈ సినిమాలో నా పాత్ర చిన్నదే అయినా కథలో కీలకంగా ఉంటుంది'' అని సత్య యాదు తెలిపారు.

వినోదాల సింగిల్


● శ్రీవిష్ణు, కేతికా శర్మ

శ్రీవిష్ణు హీరోగా రూపొందుతోన్న చిత్రం '#సింగిల్'. 'నిను వీడని నీడను నేనే' మూవీ ఫేమ్ కార్తీక్ రాజు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఇవాన, కేతికా శర్మ హీరోయిన్లు. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, కళ్యా ఫిల్మ్స్‌పై విద్యా కొప్పినీడి, భాను ప్రతాప్, రియాజ్ చౌదరి నిర్మిస్తున్నారు. ఈ సినిమాని మే 9న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించి, పోస్టర్ రిలీజ్ చేశారు. ''యూత్, ఫ్యామిలీ ఆడియన్స్‌ని అలరించే చిత్రంగా 'సింగిల్' ఉంటుంది. ఈ వేసవిలో శ్రీవిష్ణు తన నవ్వులతో ప్రేక్షకులను అలరించబోతున్నారు. ఆయన పాత్రలోని రెండు డిఫరెంట్ వేరియేషన్స్ ఆకట్టుకుంటాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. 'వెన్నెల' కిశోర్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్, కెమేరా: ఆర్. వేల్‌రాజ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అజయ్ గద్దె.

ఆ ఉద్దేశంతోనే ఈ ఫంక్షన్‌కి వచ్చాను
- బ్రహ్మానందం


● ప్రియాంక, బ్రహ్మానందం, సప్తగిరి

''తమ్ముడు సప్తగిరి సినిమా ఇది. ఒక హాస్య నటుడు సినిమా హిట్ కావాలనే ఉద్దేశంతో ఇక్కడికి వచ్చాను'' అన్నారు బ్రహ్మానందం. సప్తగిరి లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'పెళ్లి కాని ప్రసాద్'. ఈ చిత్రంలో ప్రియాంకా శర్మ హీరోయిన్. అభిలాష్ రెడ్డి గోపిడి దర్శకత్వంలో కేవై బాబు, భాను ప్రకాశ్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్ రెడ్డి ముత్యాల కలిసి నిర్మించిన ఈ చిత్రం నేడు (శుక్రవారం) విడుదలవుతోంది. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన బ్రహ్మానందం మాట్లాడుతూ– ''ప్రేక్షకులను పది కాలాల పాటు నవ్వించాలని తపన పడేవాడు హాస్యనటుడు. హాస్య నటుడిది మనల్ని నవ్వించే వృత్తి. నిజంగా ఇది పవిత్రమైనది. 'పెళ్లికాని ప్రసాద్' సినిమా కోసం సప్తగిరి చాలా కష్టపడ్డాడు. ఈ సినిమాను హిట్ చేసి, హాస్య నటుడికి మంచి జీవితం ఇవ్వాలని కోరుకుంటున్నాను'' అని అన్నారు. ''ఈ సినిమా కాన్సెప్ట్ బాగుంది'' అని మరో ముఖ్య అతిథి, దర్శక–నిర్మాత మారుతి తెలిపారు. ''ఈ సినిమాను తప్పకుండా థియేటర్స్‌లో చూడండి'' అని పేర్కొన్నారు కేవై బాబు.

కోర్ట్ విజయం మాకు హెల్ప్ అవుతుంది
- రాహుల్ రెడ్డి



''కొత్తదనంతో కూడిన మంచి కంటెంట్ ఉన్న చిత్రాలను ప్రేక్షకులు ఆదరిస్తారని నిర్మాతగా నా నమ్మకం. మంచి కంటెంట్‌తో రూపొందించిన మా 'టుక్ టుక్' విజయం పై నమ్మకం ఉంది'' అని రాహుల్ రెడ్డి అన్నారు. హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, శాన్వీ మేఘన, నిహాల్ కోదాటి ముఖ్య తారలుగా సి. సుప్రీత్ కృష్ణ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'టుక్ టుక్'. రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీవరుణ్, శ్రీరాముల రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నేడు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా రాహుల్ రెడ్డి మాట్లాడుతూ– ''దర్శకుడు సుప్రీత్‌తో కలిసి 'అలనాటి చిత్రాలు' అనే వెబ్ ఆంథాలజీ చేశాను. సుప్రీత్ చెప్పిన ఫ్యాంటసీ థ్రిల్లర్ కథ నచ్చడంతో 'టుక్ టుక్' నిర్మించాను. రెండున్నర గంటల పాటు నాన్‌స్టాప్‌గా ఎంటర్‌టైన్ చేసే ఫిల్మ్ ఇది. రోషన్ నటించిన 'కోర్ట్' సినిమా మంచి విజయం సాధించింది. ఆ సినిమా సక్సెస్ మాకూ హెల్ప్ అవుతుందని ఆశిస్తున్నాను'' అని అన్నారు.